

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -జి.మాడుగుల: ఇటీవల కడపలో రాష్ట్రస్థాయి చైన్ స్క్వేర్ పోటీల్లో బొయితిలి పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు బి, చంటిబాబు, తవుడు బాబు ప్రతిభ చాటారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అప్పలకొండ ప్రశంస పత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బొయితెలి మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు, పిడి ఉపాధ్యాయులు మాలన్న పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

-గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్

-అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు - ఆకట్టుకున్న శకటాలు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా అధికార యంత్రాంగం స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. పోలీసులు, 10 పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు ముందుగా మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ప్రగతి నివేధికపై ప్రసంగించారు. పేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. అందరి భాగస్వామ్యంతోనే జిల్లా అధివృద్ధి చెందుతుందని చెప్పారు.



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, అధికారులు

అలరించిన సాంస్కృతిక కార్య క్రమాలు

పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 12 పాఠశాల నుండి బాల, బాలికలు దేశ భక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేసారు. జి.మాడుగుల మండలం కె.కొడాపల్లి గ్రామానికి చెందిన స్వయం సహాక సంఘం సభ్యులు కోలాటం నిర్వహించారు. సాంస్కృతిక విభాగంలో పాడేరు బివికె పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం, పాడేరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆంగ్ల పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం, పాడేరు శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల, శ్రీగౌతిమి పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. కొయ్యూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన మలకం, తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

ఆకట్టు కున్న శకటాల ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివిద శాఖలు ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన అకట్టుకుంది. వైఎస్సార్ పెన్షన్ కానుక, విద్యాశాఖ, పౌర సరఫరాల శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు శకటాలను ప్రదర్శించాయి. వ్యవసాయ శాఖ ప్రథమ బహుమతి, విద్యాశాఖ ద్వితీయ బహుమతి, వైద్య ఆరోగ్య శాఖ తృతీయ బహుమతులు పొందాయి. విజేతలకు బహుమతులు అందజేసారు.

స్టాల్స్ ఏర్పాటు

కాఫీ బోర్డు, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సహకార సంస్థ, ఐసిడి ఎస్, విడివికె ఉత్పత్తులపై స్టాల్స్ ఏర్పాటు చేసారు. 2896 స్వయం సహాయక సంఘాలకు సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు రు.130 కోట్ల 40లక్షల బ్యాంకు లింకేజీ నమూనా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డిసిసిబి బ్యాంక్ మొబైల్ ఎటిఎంను ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖల ఏర్పాటు చేసిన స్టాల్ను సందర్శించారు.

ఐటిడిఏలో వేడుకలు

పాడేరు: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలో 75వ రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ముందుగా స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు, గాం మల్లు దొర, భగవాన్ బిర్సా ముండా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఐటిడిఏ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేసారు. పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పాఠశాల విద్యార్థులకు, చిన్నారులకు మిఠాయిలను పంచిపెట్టారు. ముందుగా జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి గ్రామం శ్రీ ఆంజనేయ స్వయం సహాయక సంఘం మహిళలు కోలాటంతో స్వాగతం పలికారు..ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్ ఎం.రాజు, డి.ఇ అనుదీప్, ఎస్‌డిసి వి.వి.ఎస్. శర్మ, పరిపాలనాధికారి ఎం.హేమలత, పి.హెచ్ఓ ఎన్. అశోక్, ఎఎఓ శ్రీనివాస కుమార్, డి.ఆర్.డి.ఏ. పి.డి. వి.మురళి, ఎపిఓ (పబ్లిసిటీ) పి.రాములు తదితరులు పాల్గొన్నారు..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాడేరు: సంపూర్ణ స్వరాజ్యం సాధించడం మనందరికీ గొప్ప వరం అని సంయుక్త కలెక్టర్ కె కార్తీక్ తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెసి కలెక్టరేట్ ఆవరణలో జెండా వందనం గావించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, కుల మత వర్గ, పేద ధనిక బేధాలు లేకుండా రాజ్యాంగం ముందు అందరూ సమానులేనని తెలిపారు. మన ప్రజాస్వామ్య దేశంలో అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు ఉన్నాయని వాటిని గుర్తెరిగి మనందరం బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జేసీ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వివి రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.అంబేద్కర్, వివిఎస్ శర్మ, పి. మురళీకృష్ణ, డిటిఓ ప్రసాద్ బాబు, డిపిఆర్ఓ గోవిందరాజు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఘనంగా గణతంత్ర దినోత్సవం

రంపచోడవరం : రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతమాత విముక్తి కోసం పోరాటం చేసి అసువులు బాపిన వారందరినీ ప్రతి భారతీయుడు ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు జరగడంతో ఆయా తరగతులు అభివృద్ధి చెందాయని చెప్పారు. గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు ప్రత్యేకమైన కొన్ని హక్కులు రాజ్యాంగం ద్వారా వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, కార్యాలయ పరిపాలన అధికారి మడకం సావిత్రి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



రంపచోడవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్



కేక్ కట్ చేసి విజయోత్సవం చేసుకుంటున్న అంగన్వాడీలు

అంగన్వాడీల విజయోత్సవ సభ

- ఐక్య పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

- సిఐటియు రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

అంగన్వాడీలు 43 రోజుల పాడు సమ్మె, వివిధ రూపాల్లో ఆందోళన చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక పాత ఎంపిడిఒ కార్యాలయం ముందు విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై తమ ప్రాణాలను ఫణంగా పెట్టారన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ కనీవినీ ఎరగని రీతిలో అంగన్వాడీలు చేసిన ఉద్యమం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అయిందన్నారు. ఇది అంగన్వాడీల ఐక్య పోరాట విజయమని, ఐక్యంగా పోరాడితే ఏ సమస్యనైనా సాధించుకోవచ్చని అంగన్వాడీలు నిరూపించారని తెలిపారు. యూనియన్ జిల్లా నాయకులు నిర్మల కుమారి మాట్లాడుతూ ఇంతటి ఐక్యంగా కదిలిన అంగన్వాడీలకు అభినందనలు, అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ భగభగ మండే సూర్యుని చూడు అంగన్వాడీల సత్తా చూడు అనే ఒక్క నినాదం రాష్ట్ర ప్రభుత్వాన్ని కుదిపేలా చేసిందన్నారు. అంగన్వాడీలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ప్రతి ఒక్కరు బయటకొచ్చి సంఘీభావం తెలిపారన్నారు. గిరిజన ప్రాంత సమస్యలపై ప్రజల తరపున నిలబడే నాయకుడిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.ప్రసూన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, గొర్లె శాంతిరాజు, వీకా రాజన్న దొర, యూనియన్ నాయకులు ఎస్.రత్నకుమారి, మారేడుమిల్లి, వై రామవరం మండలం అప్పర్ పార్టు అంగన్వాడీలు పాల్గొన్నారు.



హెడ్‌లైట్ వేసుకొని ప్రయాణిస్తున్న వాహన చోదకుడు

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం తెల్లవారుజాము నుంచి 8 గంటల వరకు దట్టంగా మంచు కురిసింది. దీంతో ప్రజలు నాన అవస్థలు పడ్డారు. సంక్రాంతికి ముందు మంచు అధికంగా కురిసి, చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గత మూడు రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం నెలకొనడంతో చలి తీవ్రత తగ్గింది. అయితే గురువారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని, చలి పెరిగింది. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దట్టంగా పొగ మంచు కురవడంతో పాటు చలి కూడా చాలా ఎక్కువగా ఉంది. ఉదయం 8 గంటల వరకు భానుడి దర్శనం కాలేదు. చలి తీవ్రత వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు గురయ్యారు. పొగ మంచు కారణంగా వాహనచోదకులు ఉదయం కూడా హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. సీలేరు నుంచి జీకే వీధి మీదుగా మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనచోదకులు మంచు తీవ్రత వలన రహదారి కనిపించక అనేక ఇబ్బందులకు గురయ్యారు.



ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద పూర్వ విద్యార్థులు

దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని బోర్నగూడం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాలలో చదివిన 2000 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు గొల్లపూడి పెద్దరాజు, పొట్ట బోయిన రమణ, దాసరి పైడిమల్లు, సతీష్, రమేష్, రాంబాబు, పెంటయ్య, కురుపల్లి రాజు తదితరులు తమ సొంత డబ్బులతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు తదితర దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు : గంజాయి అక్రమ రవాణా, సాగు, మద్యం నిల్వలపై తయారీపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కాట్రగడ్డ గ్రామంలో గురు శు క్రవారాల్లో విస్తృత తనిఖీ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో పోలీస్ ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. పలు వాహనాలను నిలిపి తనిఖీ చేసి, వారి వివరాలు అడిగి తెలుసుకొని విడిచిపెట్టారు. ఆటోల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశమైన ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు సంఘ విగ్రహ శక్తులతో చేతులు కలిపి ఎటువంటి సమస్యలు సృష్టించినా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, గంజాయి స్మగ్లర్లు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం వెంటనే చేరవేయాలని, మీ వివరాలు గోప్యమంగా ఉంచుతామని చెప్పారు.




వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

28న బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో ఈనెల 28న రాజమండ్రిలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజారావు, ఎస్ బాలకృష్ణ కోరారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేయాలని, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వైఖరిని స్పష్టం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో భాగంగా సిపిఎస్ రద్దు అంశాన్ని ప్రధాన అంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోరుతూ ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కే.బాబ్జి, టి.మేఘనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్రహం

ఓడిపోయే అభ్యర్థికి టిడిపి టికెట్

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యుడు అబ్రహం


ప్రజాశక్తి- పెదబయలు: అరకు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓడిపోయే అభ్యర్థిని సమన్వయకర్తగా నియమించి తప్పు చేసిందని మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం తెలిపారు. శనివారం విలేఖరులతో మాట్లాడుతూ, తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే సోమ సర్పంచిగా, జడ్పీటీసీగానూ, అరకు ఎమ్మెల్యే పని చేశారని, పార్టీ జెండా మోస్తూనే అశువులు బాసారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారకుడైన సెవెరీ దొన్నుదొరకు టికెట్ కేటాయించడంతో కార్యకర్తలు అసంతృప్తిలో ఉన్నారన్నారు. మొదటి నుండి పార్టీ జెండాలను మోసిన వారిని కాదని ఓడిపోయే వారికి టికెట్ కేటాయించడం సరికాదన్నారు. తాము ఎంత కష్టపడినా పార్టీ అధిష్టనం మొండి చెయ్యి చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం కార్యకర్తల అభిప్రాయం మేరకు పర్యటిస్తూ సతంత్ర అభ్యర్థిగా 2024 అసెంబ్లీ బరిలో ఉంటానన్నారు. తనకు టికెట్ కేటాయించక పోయినా కిడారి శ్రవణ్ కుమార్‌కు ఇస్తే తప్పకుండా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇంచార్జి పాంగి శాస్త్రి బాబు, స్థానిక మాజీ సర్పంచ్ టి.త్రినాథ్, రైతు సంఘం అధ్యక్షులు కుడా భూషణం, బాలం నాయుడు, సల్లంగి రవి కుమార్, వైస్ ఎంపీపీ పాంగి సోనే పాల్గొన్నారు.

ఉత్తమ సేవా అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం పాడేరులో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు.

రంపచోడవరం : రంపచోడవరం ఎంఇఒ కేవీపీ సత్యనారాయణ దొర ఉత్తమ అధికారి అవార్డును కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విల్సన్, విశ్వరాజు, సూరిబాబు, సనాతన, వెంగల్, టాల్ స్థాయి, అనిల్, లింగన్న ఎంఇఒకు అభినందనలు తెలిపారు. రంపచోడవరం సబ్ డివిజన్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ కెవివి సత్యనారాయణ ఉత్తమ ఉద్యోగి అవార్డును రాజమండ్రి విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్.మూర్తి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేతుల మీదుగా తీసుకున్నారు.



అవార్డును అందుకుంటున్న సత్యనారాయణ



జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న రాజవొమ్మంగి మండలం బొర్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎజ్రాశాస్త్రి, జికె.వీధి మండలం దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు, దుంబ్రిగుడ మండలం అరకు వెలుగు ఏరియా క్లస్టర్ కో-ఆర్డినేటర్ కృష్ణారావు

రాజవొమ్మంగి : స్థానిక డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, మండలంలోని బొర్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎజ్రాశాస్త్రి ఉత్తమ ఉద్యోగి అవార్డులను కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటిడిఎ పిఓ అభిషేక్ చేతుల మీదుగా అందుకున్నారు. వారికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

సీలేరు : ఆదివాసీల ఆరోగ్యం కోసం అనునిత్యం పరితపిస్తూ, అందుబాటులో ఉంటూ అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న జికె.వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందుకి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కలెక్టర్ సుమిత్ కుమార్ విశిష్ట సేవ ప్రశంస పత్రాన్ని హిమబిందుకు అందజేశారు. తను అత్యుత్తమ సేవా పురస్కారం అందుకోవడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఈ సందర్భంగా హిమబిందు తెలిపారు.

దుంబ్రిగుడ : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకుగాను వెలుగు అరకు ఏరియా క్లస్టర్ కోఆర్డినేటర్(ఏసి) ఎస్.కృష్ణారావు ఉత్తమ అవార్డు పొందారు. శుక్రవారం పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తమ అవార్డును ఆయనకు అందజేశారు. ఉత్తమ అవార్డు అందుకున్న ఆయనకు స్థానిక మండల వెలుగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అభినందించారు.


విద్యార్థులకు పుస్తకాలు, ఆట వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జిల్లాలోని వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీ పరిధి రావడికోట జిపిఎస్ పాఠశాలకు, విద్యార్థులకు ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కంటే స్వాతి ఆధ్వర్యంలో కుర్చీలు, బల్లలు, పుస్తకాలు, ఆట వస్తువులు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తమ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నేటికీ ఇక్కడి విద్యార్థులకు పక్కా భవనం లేదని, ఐటిడిఏ అధికారులు స్పందించి పాఠశాలకు పక్క భవన నిర్మించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో సరైన రహదారులు లేక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



కుర్చీలు, బల్లలు, పుస్తకాలు, ఆట వస్తువులు అందజేసిన ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ కంటె స్వాతి



పొయ్యిలు అందజేస్తున్న ఎంపిటిసి వేక రాజ్‌కుమార్

గిరిజనులకు పొయ్యిల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని తుమ్మల గ్రామస్తులకు ట్రయాంటోనా పొయ్యిలను ఎంపీటీసీ వేక రాజ్ కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రయాంటోనా పొయ్యి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, సులువుగా ఉంటుందని, 100 శాతం కర్ర మండుతుందని, 80శాతం వరకు పొగ తగ్గుతుందని చెప్పారు. దీని వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చింతూరు కో-ఆర్డినేటర్ మడివి సుందరయ్య మాట్లాడుతూ మండలం మొత్తం ఈ పొయ్యిలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎట్టపాక మండల కో-ఆర్డినేటర్ ఉయిక రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు వేక గోవింద్, సోడి సాయి కుమార్, సోడి పొదయ్య, వేక కన్నారావు పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

- మహిళ మృతి : ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల సమీపంలో కటికి జలపాతానికి వెళ్లే రహదారిలో ఓ టయోటా కారు లోయలో దూసుకు పోవడంతో మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి సంఘటన వివరాలు.. విశాఖపట్నంలోని ఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న సిబ్బంది శుక్రవారం అనంతగిరి బొర్రా గుహలు తదితర ప్రాంతాలు తిలకించడానికి వస్తున్నారు.విశాఖపట్నం మాధవధార, మధురవాడ ప్రాంతాలకు చెందిన 12 మంది బయలుదేరారు బొర్రా గుహల సమీపంలో ఉన్న కటికి సమీపంలో మలుపు వద్ద కారు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. దీంతో ఈ కారు ప్రయాణిస్తున్న పీలా అన్నపూర్ణ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా నాయుడు, రమేష్, మాధవిలకు తీవ్ర గాయాలు అయ్యాయి.సమీప బోయిగూడ, జడ్డి పనస గ్రామాల గిరిజనులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అరకులోయ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కెజిహెచ్‌కి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమి తథ్యం

ప్రజాశక్తి -తగరపువలస : మరో మూడు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ఓటమి తథ్యమని స్థానిక కాంగ్రెస్ నాయకులు జోస్యం చెప్పారు.శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పిసిసి ప్రధాన కార్యదర్శిగాదం మహేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ధ్వజమెత్తా రు. సీనియర్ నేతపల్లా వెంకట రావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగపరిశ్రమలు, సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్ట బెడుతోందని ఆరోపించారు. చిట్టివలస జ్యూట్ మిల్లు మూతబడి వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, స్థానికంగా ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ హామీ నేటికీ కలగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. పార్టీ సీనియర్ నాయకులు కదిరి జగన్నాధం మాట్లాడుతూ దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు.సమావేశంలో పార్టీ నాయకులు పోతిన ఎల్లాజీ, నిమ్మకాయల పైడిరాజు, కె సన్యాసిరావు పాల్గొన్నారు

దత్తతకు మూడు గ్రామాలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని మూడు పంచాయతీలను దత్తత తీసుకొని ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గొట్టిపల్లి గ్రామాన్ని సందర్శించి, సదుపాయాల కల్పనపై సమగ్ర అధ్యయనం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, గ్రామ కార్యదర్శి సురేష్ బాబు, సత్యసాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, బంటుమిల్లి సూరప్పలనాయుడు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

29 నుంచి ఏపిఇఆర్‌సి

ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి -పిఎం పాలెం : 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 29 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు నాలుగు రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి కమిషన్ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారన్నారు. వర్చువల్ విధానంలో ప్రజలు, వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చెప్పవచ్చన్నారు.. ఈ మేరకు మధురవాడ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆయా రోజుల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎవరైనా కార్యక్రమంలో పాల్గొనవచ్చునని, ముందుగా 9490606924 ఫోన్ నంబరుకు సంప్రదించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

వాడవాడల్లో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ శెట్టి నిలవేణి, స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు పతాకాన్ని ఆవిష్కరించారు, తహసిల్దార్ రాంబాయి, ఎస్సై రాము, హెచ్‌ఎంలు కె. అప్పలస్వామి, బి.మంగ, ఎస్‌డబ్ల్యూఒ రాజ్యలక్ష్మి వేడుకల్లో పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని మత్స్యపురం పంచాయతీ జిపిఎస్ పాఠశాల విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కారక్రమంలో జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రామకృష్ణ, మత్స్యపురం సర్పంచ్ సుబ్బా రావు, చందన, పెల్లమల వెంకటరావు, వార్డ్ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

చింతపల్లి: ఎందరో త్యాగధనుల ఉద్యమ ఫలితంగా వచ్చిన గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రతి ఏటా జనవరి 26న జరుపుకోవడం సంతోషకరమైన విషయమని ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ రాజేంద్రపాలెం జిపిఎస్‌టిడబ్ల్యూ పాఠశాలలో ఉపాధ్యాయులు రామకృష్ణ, స్వప్న సుందరిలతో కలిసి పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో అణగారిన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అత్యున్నతమైన పదవులు దక్కేందుకు అవకాశం కల్పించారన్నారు. ఆదివాసి ప్రాంతాలలో పోరాట యోధులు కొమరం భీమ్, బిర్స ముండా, గాం గంటందొర, మల్రి కామయ్య, మల్లు దొర, మాతే లక్ష్మయ్యల స్ఫూర్తితో ఆదివాసి ప్రాంతంలో యువత, మేధావులు, నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు.

జి.మాడుగుల: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ, జి.మాడుగుల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందడం సంతోషదాయకమన్నారు.

పెదబయలు : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ విగ్గేష్, పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ పులి మనోజ్ కుమార్, పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

దుంబ్రిగుడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో బి.ఉషారాణి, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కొర్రాయి పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ పి.కొమ్ములు, కంద్రూం సచివాలయంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కే.హరి జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. మండల ఎంపీపీ బీ.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, పి.లలిత తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిపాలన అధికారి పి.జయంతి, మండల తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణ, జిసిసి వద్ద మేనేజర్ రాజారెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి బాలాజీ బాబు, సర్పంచ్ కొండా జాకబ్, ఉప సర్పంచ్ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, గురుకుల బాలుర పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆయా ప్రిన్సిపాళ్లు బిఎస్.కుమార్, ప్రిన్సిపల్ సత్యవేణి, ప్రిన్సిపాల్ టిఅరుణ కుమారి, కెజిబివిలో స్పెషల్ ఆఫీసర్ మయూరి లక్ష్మి జాతీయ జెండాలను ఎగరవేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లిలోని ఎంపీడీవో, వెలుగు కార్యాలయాలు, సచివాలయాల వద్ద ఎంపీడీవో ఫణీంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి తదితరులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు తాతబాబు ప్రకాష్, కారం సుందరయ్య, టిడిపి నాయకులు ప్రకాష్‌రావు, ఉపసర్పంచ్ లక్ష్మణరావు, వైసిపి నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు శ్రీను, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక అబ్దుల్ కలాం స్కూల్ ఆవరణలో జాతీయ పతాకాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ మాదిరెడ్డి రామలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మాగాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, కట్ట బ్రాహ్మణ వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ యండి.సాదత్, ఉపాధ్యాయులు రమ్య, లాహరి, భవాని, తరుణ్, మీన, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు జి.వెంకట్రావు, సిహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ వై.పద్మ, కె. శకుంతల, జి.హారతి, యస్ అప్పనమ్మ, కె. శైలజ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక తాహశీల్దార్ కార్యాలయం వద్ద తాహసిల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, పోలీస్ స్టేషన్లో సీఐ స్వామి నాయుడు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రఘునాథరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గోపాలకృష్ణ జాతీయ జెండాల ఆవిష్కరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ ఎస్ఐ రామకృష్ణ, ఏపీ జెన్కో కార్యాలయం వద్ద ఎస్ఈ సివిల్ కేకేవీ.ప్రశాంత్ కుమార్, సచివాలయం వద్ద కార్యదర్శి శ్రీనివాస్, చింతపల్లి క్యాంప్ యూపీ స్కూల్, సీలేరు గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమం పాఠశాల, డిఎవి కాన్వెంట్, దారకొండ, సప్పర్ల బాలురు ఆశ్రమం పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సీలేరు సర్పంచ్ దుర్జో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి పాల్గొన్నారు.


విఆర్.పురంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న సిపిఎం ఎంపిపి కారం లక్ష్మి


దుంబ్రిగుడలో....


చింతూరులో...



మారేడుమిల్లిలో..


పెదబయలులో...


సీలేరు ఏపి జెన్కో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ల వద్ద....


పోస్టు కార్డులు చూపుతున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత రాష్ట్రపతికి అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోస్ట్ కార్డులు రాశారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వి.తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కోటేశ్వరరావు, ఆర్.సత్యారావు, జిల్లా కోశాధికారి కె.జానకిరాజు, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఎస్.గీత, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిముడు చిన్నంనాయుడు, జివిఆర్.మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ యు.బొంజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై చోద్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడకుండా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చోద్యం చూస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలు అమరావతిని ఏకైక రాజధానిగా కోరుకుంటున్నారే తప్ప మూడు రాజధానులు కాదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ ఉక్కుతో పాటు రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారన్నారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంటు కార్యదర్శి బోడెపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్, 31వ వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు బసరమాని రమాదేవి, గుడ్ల హేమలత పాల్గొన్నారు.

ఓటమిని ముందే అంగీకరించిన జగన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అధికారం కోల్పోతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుగానే అంగీకరించారని టిడిపి మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ 2021లో ఆడిన మాటలకూ, నేడు ఆడుతున్న మాటలకూ చాలా వ్యత్యాసముందన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న క్రెడాయ్ ప్రతినిధులు, రక్తదాతలు

క్రెడాయ్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం కెఎస్‌అర్ ఫంక్షన్ ప్లాజాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ సభ్యులతో పాటు పలువురు రక్తదానం చేశారు. సంస్థ మాజీ చైర్మన్ జివివిఎస్ ముందుగా రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఛైర్మన్ కెఎస్‌ఆర్‌కె.రాజు, కార్యదర్శి వి.శ్రీను, ఉపాధ్యక్షులు సిహెచ్.గోవిందరాజు, కోశాధికారి కెవిఆర్.రాజు (రమేష్), సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.నరసింహారావు పాల్గొన్నారు.


ఎన్నికలకు వైసిపి 'సిద్ధం'

నేడు సంగివలస వేదికగా జగన్ బహిరంగ సభ

ఏర్పాట్లును పరిశీలించిన వైవి.సుబ్బారెడ్డి, బొత్స, అమర్‌నాథ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, తగరపువలస విలేకరి

సిద్ధం పేరిట విశాఖ వేదికగా వైసిపి శనివారం ఎన్నికల శంఖారావం పూరించనుంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటల నుంచి జివిఎంసి ఒకటో జోన్ పరిధి సంగివలసలో జరుగనున్న వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఇక్కడి నుంచే పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. 2019లో అధికారం చేపట్టిన తర్వాత భీమిలి ప్రాంతంలో సిఎం జగన్ పాల్గొనున్న తొలి సభ కావడంతో పాటు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సభ కావడంతో ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇప్పటికే జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించారని నాయకులకు సూచించారు. వైసిపి రంగులతో వేదికను విశాలంగా, చూడముచ్చటగా శుక్రవారానికే తీర్చిదిద్దారు. ఎమ్మెల్సీ, ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ తలశిల రఘురాం ప్రత్యక్ష పర్యవేక్షణలో వేదికను రూపొందించారు. 75 అడుగుల ఎత్తు, వంద అడుగుల పొడవు, 50 అడుగుల వెడల్పుతో ఈ వేదికను ఏర్పాటు చేశారు. సుమారు లక్షా 50 వేల మందికి సరిపడేలా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో వేదిక, ప్రాంగణం ఉన్నాయి. వేదికకు కొద్ది దూరంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. రెండు వేల మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.


సంగివలసలో సిద్ధమవుతున్న సభా వేదిక

ఏర్పాట్ల పరిశీలన

సంగివలస వద్ద బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ అధినాయకులు శుక్రవారం పరిశీలించారు. ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, యువజన నాయకులు అవనాపు విక్రమ్ తదితరులు సభా స్థలికి చేరుకుని ఏర్పాట్లు తీరును అడిగి తెలుసుకున్నారు. తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు దురుద్దేశపూర్వకంగా చేస్తున్న విమర్శలను, ఆరోపణలను ఏ విధంగా ఎదుర్కోవాలి ? వారికి ఏ విధంగా సమాధానం చెప్పాలి ? అన్న అంశంపై పార్టీ కేడర్‌కు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. టిడిపి, జనసేన పొత్తు అంశంపై స్పందిస్తూ చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడైనా ధర్మాన్ని పాటించారా ? అని ప్రశ్నించారు. జనసేన, టిడిపి మధ్య ఉన్న పొత్తు ధర్మాన్ని చంద్రబాబు విస్మరించినట్లు పవన్ చెప్పడం బట్టి వారి మధ్య ఎలాంటి అవగాహన ఉందో అర్థమవుతుందని అన్నారు.

జగన్ షెడ్యూల్ ఇలా..

శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి జగన్ విశాఖకు బయల్దేరనున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో నేరుగా మధ్యాహ్నం 3 గంటలకు భీమిలి నియోజకవర్గం సంగివలస ఎన్‌ఆర్‌ఐ కాలేజీ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో పోలమాంబ టెంపుల్‌కు వెళ్తారు. సంగివలస గ్రామంలోని సభా స్థలి వద్దకు 3.30 గంటలకు వస్తారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 5.10 గంటలకు సంగివలస నుంచి హెలీకాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరం, అనంతరం రోడ్డు మార్గాన తన నివాసానికి చేరుకుంటారు.

బిజెపి ఓటమితోనే రాజ్యాంగానికి రక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని, దానికి మద్దతు ఇస్తున్న వారిని ఓడించడం ద్వారా మాత్రమే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి బైకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని నర్సింగరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న మత సామరస్యానికి, సేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదానికి విఘాతం కలిగిస్తోందన్నారు. దేశభక్తి పేరు చెప్పి దేశంలో వున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలైన అంబానీ, అదానీలకు కట్టబెడుతోందన్నారు. రామాలయం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. రైతులకు నష్టం చేసే నల్ల చట్టాలను, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. వీటి రద్దు కోసం కార్మిక, కర్షక ఐక్యతతో పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులకు స్వామినాధన్ కమిషన్ రిపోర్టును అమలు చేసి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, భూ హక్కు చట్టం 22ను ఉపసంహరించాలని, ఆహారభద్రత చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదన విరమించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న పారిశ్రామిక సమ్మె - గ్రామీణ బంద్ జరుగుతున్నాయని, వీటిలో కార్మికులు, రైతాంగం, ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

ఆకట్టుకున్న పిఎంజె ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రఖ్యాత పిఎంజె జ్యూయలర్స్ సంస్థ నోవాటల్‌లో మూడు రోజులపాటు తలపెట్టిన ఎగ్జిబిషన్ తొలిరోజైన శుక్రవారం ఆకట్టుకుంది. పది వేలకు పైగా హ్యాండిక్రాఫ్ట్ డిజైన్లను ప్రదర్శించారు. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితోపాటు పిఎంజె జ్యూయలర్స్ ఎపి స్టేట్ హెడ్ హైదర్ అలీ, వైజాగ్ హెడ్ ఆనంద్ జిలగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ కళాత్మక ఆభరణాల రూపకల్పనలో పిఎంజె విశిష్ట గుర్తింపు పొందిందన్నారు. మూడు రోజుల ప్రదర్శనలో భాగంగా సంప్రదాయం, సమకాలీన డిజైన్లతో ఆకర్షణీయమైన హస్తకళా ఆభరణాలు ఈ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయి. బంగారం, వజ్రాలతో కూడిన వివాహ ఆభరణాల శ్రేణి ఆకర్షిస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిన తలారి సురేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సమక్షంలో విశాఖ నగరానికి చెందిన నాయకులు తలారి సురేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షర్మిల ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాన్ని షర్మిలకు తలారి సురేష్ అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అందరినీ ఆకట్టుకునేలా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గీతా ఆర్ట్స్ 2, మహాయణ మోషన్ పిక్చర్స్ ధీరజ్, మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో టాలీవుడ్ యువ నటుడు, కలర్ ఫొటో ఫేమ్ సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ నగరంలోని ఒక హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. దీనిలో హీరో సుహాస్ మాట్లాడుతూ ఈ సినిమా వచ్చే నెల రెండో తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందన్నారు. హీరోయిన్ శివాని, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువతకు గ్రూప్ 2 స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆదివాసీ యువతకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం గ్రూప్ 2 స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. సంఘం జిల్లా అధ్యక్షులు కిముడు చిన్నంనాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ స్టడీ మెటీరియల్‌ను ఆదివాసీ యువతీ యువకులకు అందజేశారు. సుమారు 220 మంది విద్యార్థులు మెటీరియల్‌ను స్వీకరించారు.

అలాగే గ్రూప్ 1, 2 అభ్యర్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ క్రాంతికార్ వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు టి.చిట్టిబాబు, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ వి.తిరుపతిరావు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.కోటేశ్వరరావు, ఆర్.సత్యారావు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎస్.గీత, కిముడు జానకి రాజు, వీరాస్వామి, 300 మంది విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.